https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 28 శుక్రవారం 22-05-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

# కేటీఆర్ అసలు మనిషేనా!?

- కేటీఆర్‌ది ముమ్మాటికీ శాడిజమే
- బాలికను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తారా!?
- బండి సంజయ్‌కు, కేటీఆర్‌కు మధ్యన ఏదో పంచాయితీ ఉన్నట్లుంది
- కేటీఆర్ జడ్జిగా.. ప్రవీణ్‌కుమార్ దర్యాప్తు అధికారిగా శిక్షలు కూడా వేసేశారు
- డ్రగ్స్‌తో దొరికిన బావమరిది, పార్టీ మాజీ ఎమ్మెల్యే గురించి మాట్లాడలేదేం!?
- బీఆర్ఎస్ వాళ్లు మనుషులేనా? రైతు మృతదేహం దగ్గర నవ్వుతూ సెల్ఫీలా!?
- బీఆర్ఎస్ అనుకూల మిల్లర్లు, నేతలు ధాన్యం లారీ లోడ్ దించనీయడం లేదు
- బీఆర్ఎస్‌ది ఆర్గనైజ్డ్ క్రైం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపాటు
- అమ్మాయి దుస్తుల గురించేనా.. అబ్బాయిల పెంపకాన్ని ప్రశ్నించరా?: మీనాక్షి



**హైదరాబాద్, మే 21:**
"కేటీఆర్ అసలు మనిషేనా!? రాజకీయాన్ని, సమస్యను వేరుగా చూడాలి. రాజకీయంగా నాతో కొట్లాడాలి. కానీ, మైనర్ బాలికను అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడమేంటి!? బాలికను అడ్డం పెట్టుకుని ఏదో చేయాలనే శాడిజం ఏంటి!? ఇది ముమ్మాటికీ శాడిజమే" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మనిషికి ఉండాల్సిన కనీస విలువలు గానీ, మానవత్వం గానీ బీఆర్ఎస్‌కు, ఆ పార్టీ నాయకులకు లేవని, వాళ్లు అసలు మనుషులుగా కూడా వ్యవహరించడం లేదని మండిపడ్డారు. వరి వేస్తే ఉరి అని చెప్పినవాళ్లు ఇప్పుడు సిగ్గు లేకుండా రైతుల కల్లాల దగ్గరకు వెళ్తున్నారని, పైగా మరణించిన రైతు దగ్గర నవ్వుకుంటూ సెల్ఫీలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. వాళ్ల దగ్గర దొంగ సొమ్ము చాలా ఉందని, రైతు కుటుంబానికి ఎంతో కొంత సాయం చేయవచ్చని, అయినా చేయడం లేదని తప్పుబట్టారు. సాయం చేయకపోగా ఈ శవ రాజకీయాలు ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వివేక్‌తో కలిసి గురువారం సచివాలయంలో ఆయన విలే కరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఇటీవల రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన మైనర్ బాలిక పోక్సో కేసు విషయం గురించి సీఎం రేవంత్‌ను విలేకరులు అడగ్గా.. దానిపై ఆయన స్పందించారు. "మైనర్ బాలిక వ్యవహారంలో ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు. ఇది చాలా సున్నితమైన అంశం. దానిని కూడా రాజకీయం చేస్తున్నారు. బండి సంజయ్‌కు, కేటీఆర్‌కు మధ్యన ఏదో పంచాయితీ ఉన్నట్టుంది. దానిని పిల్లల మీద పెట్టి కేటీఆర్ రాజకీయం చేస్తున్నారు. ఇది ఎంతవరకు సమంజసమో వారే ఆలోచించుకోవాలి" అని వ్యాఖ్యానించారు. బండి భగీరథ్‌ను అరెస్టు చేశామని పోలీసులు చెప్పారని, తాను దానినే నమ్ముతున్నానని తెలిపారు. పోలీసులను ఇంటికి పిలిచి అప్పగిస్తే దాన్ని సరెండర్ అంటారని, అప్పా జంక్షన్ దగ్గర నాకాబందీ నిర్వహి స్తున్న సమయంలో భగీరథ్‌ను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తనకు చెప్పారని తెలిపారు. అరెస్టు చేశామని పోలీసులు చెబుతుంటే, సరెండర్ చేశామని సంజయ్ అంటున్నారని, అప్పా జంక్షన్ ఎవరి ఇల్లు అని ప్రశ్నించారు. భగీరథ్‌పై పోక్సో కేసు విషయంలో ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకుందని, కానీ, కేటీఆర్ జడ్జిగా, ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ దర్యాప్తు అధికారిగా (ఐ.వో)గా వ్యవహరించి వాళ్లే శిక్షలు కూడా వేశారని తప్పుబట్టారు. "ఈ కేసు చాలా సున్నితమైనది. ఎవరి పేర్లు చెప్పడానికి వీల్లేదు. బీఆర్ఎస్ నేతలు మాత్రం సదరు మైనర్ బాలికను రోడ్లపైకి తీసుకొస్తున్నారు. దాంతో, ఆ అమ్మాయి కుటుంబం ఆవేదన చెందుతోంది" అని బండి సంజయ్ కొడుకు విషయంలో ఇంతస్థాయిలో మాట్లాడిన కేటీఆర్.. ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ తీసుకుని దొరికిన తన బావ మరిది విషయంలో ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాలని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. "దీపావళి పండుగ చేసుకుంటుంటే ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నిస్తూ, ఎదురు తిరిగారు. వాళ్ల పార్టీకి చెందిన మరో ఎమ్మెల్సీ కోడి పందేల్లో దొరికాడు. ఆర్థిక లావాదేవీలతో దుబాయ్‌లో చనిపోయిన తన మిత్రుడి గురించి కానీ, ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్‌తో దొరికి పోలీసులపై కాల్పులు జరిపిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గురించి కానీ ఎందుకు మాట్లాడడం లేదు!? పార్టీ మాజీ ఎమ్మెల్యేకి కనీసం నోటీసు కూడా ఇవ్వలేదు. పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదు. ఇంతకంటే సిగ్గు తప్పిన వ్యక్తులు ఉంటారా!? డ్రగ్స్‌తో దొరికి, పోలీసులపై కాల్పులు జరిపిన వ్యక్తి జాతిరత్నంలాగా కనిపిస్తున్నారని, ఇతరుల పిల్లలపై చట్టపరంగా చర్యలు తీసుకున్నా ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫామ్ హౌస్‌లో డ్రగ్స్‌తో దొరికిన కేటీఆర్ బావమరిదికి ఎలా అయితే నోటీసు ఇచ్చామో, బండి భగీరథ్‌కు కూడా అదేవిధంగా నోటీసు ఇచ్చామని తెలిపారు. "అమ్మాయి మేజర్ అని భగీరథ్ కరీంనగర్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో, అమ్మాయి వయసు ఎంత, మేజరా, మైనరా అని నిర్ధారించాల్సి వచ్చింది. అందుకోసం ఆస్పత్రికి, పాఠశాలకు వెళ్లడంతోపాటు ఆధార్ కార్డు పరిశీలించి, పదో తరగతి పత్రాలు చూసి.. అమ్మాయి మైనర్ అని నిర్ధారించాం. దాని ప్రకారమే చట్టపరంగా చర్యలు తీసుకున్నాం. కేటీఆర్ కోర్టులో ఆయన జడ్జిగా, ప్రవీణ్‌కుమార్ ఐవోగా చెబితే సరిపోతుందా!?" అని మండిపడ్డారు. ప్రవీణ్‌కుమార్ ఇప్పుడు తీసేసిన తహశీల్దార్ అని, ఆయన ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని ఎద్దేవా చేశారు. "మైనర్ బాలిక విషయంలో రాష్ట్రంలో ఇంత చర్చ జరుగుతుంటే ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ ఎందుకు బయటకు రాలేదు!? ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని పార్టీలోకి చేర్చుకునేందుకు జగిత్యాల వరకు వెళ్లిన వ్యక్తి.. కేటీఆర్ చెబుతున్నదే నిజమైతే బాలిక విషయంలో ఎందుకు మాట్లాడడం లేదు!?" అని ప్రశ్నించారు.

# ఇక 'మర్యాద'గా లోన్ రికవరీ

- ఏజెంట్లు దుర్భాషలాడడం, వేధించడం కుదరదు
- ఉదయం 8 నుంచి రాత్రి 7 వరకే కస్టమర్లకు ఫోన్ చేయాలి.. మిత్రులు, బంధువులకు ఫోన్లు చేయరాదు
- వ్యక్తిగత సమాచారాన్ని సోషల్‌మీడియాలో పెట్టడం నేరం
- ఈ నెల 31 దాకా చట్ట సవరణ ముసాయిదాపై అభిప్రాయాలు తెలపాలి..
- అక్టోబరు 1 నుంచి అమల్లోకి




**న్యూఢిల్లీ, మే 21:**
అవసరం కోసం బ్యాంకులో లోన్ తీసుకొని ఏవైనా ఇబ్బందుల వల్ల సకాలంలో తిరిగి చెల్లించకపోతే.. ఆ బ్యాంకు రికవరీ ఏజెంట్ల నుంచి ఎదురయ్యే వేధింపులు చెప్పనలవి కాదు. గంటగంటకు ఫోన్ చేయటం, నోటికి వచ్చినట్లు దుర్భాషలాడటం, బెదిరించటం ఒక్కటేమిటి.. వినియోగదారుడికి నరకం చూపిస్తారు. బ్యాంకుల ఉద్యోగులు కూడా వేధింపులకు పాల్పడతారు. ఇదేమిటని అడిగితే.. ఏజెంట్లు తమ ఉద్యోగులు కా దని బ్యాంకులు తప్పించుకుంటున్నాయి. ఈ వేధింపులన్నింటికీ చెక్ పెట్టేలా ఆర్బీఐ కీలక మార్గదర్శకాలు తేబోతోంది. 'రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (వాణిజ్య బ్యాంకులు- బాధ్యతాయుత వ్యాపార నియమావళి) సవరణ మార్గదర్శకాలు- 2026' పేరుతో ముసాయిదాను విడుదల చేసింది. ఈ ముసాయిదాపై ఈ నెల 31వ తేదీ వరకు ప్రజల అభిప్రాయం కోరింది. ఈ సవరణ చట్టం వచ్చే అక్టోబరు 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. ఇందులో 'లోన్‌రికవరీ ఏజెన్సీలు, ఏజెంట్లు' అనే పదాలకు ఆర్బీఐ స్పష్టమైన నిర్వచనం ఇచ్చింది. వీరికి కచ్చితమైన అర్హతలను, విధి నిర్వహణ నియమావళినీ నిర్దేశించింది. ఏజెంట్లు చేసే తప్పులకు బ్యాంకులు బాధ్యత వహించేలా నిబంధనలు పొం దుపర్చింది. కస్టమర్ల రక్షణకు పటిష్ఠమైన చర్యలను ప్రతిపాదించింది.

# యురేనియాన్ని వదులుకోం

- శుద్ధిచేసిన యురేనియం ఇరాన్‌లోనే ఉండాలి
- ఆ దేశ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆదేశాలు



**టెహ్రాన్, మే 21:**
తన అణు కార్యక్రమాన్ని పూర్తిగా వదులుకునే ప్రసక్తే లేదని ఇరాన్ మరోసారి తేల్చిచెప్పింది. ఇప్పటి వరకు శుద్ధి చేసిన యురేనియాన్ని కూడా వదిలే ప్రసక్తే లేదని పేర్కొంది. ఈ మేరకు ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తమ దేశ నాయకత్వానికి ఆదేశాలు జారీ చేశారు. ఇరాన్‌లోని కీలక ఉన్నతాధి కారులను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ కథనం ప్రచురించింది. కాగా, ఇరాన్ యురేనియాన్ని వదులుకునే ప్ర సక్తే లేదని సుప్రీం లీడర్ మొజ్తాబా తాజాగా ఆదేశించా రని, ఇతర కీలక నేతలంతా దీనిపై ఏకాభిప్రాయంతో ఉన్నారని ఇరాన్ అధికార వర్గాలు పేర్కొన్నాయి. అయితే.. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియాన్ని కచ్చితంగా స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ గురువారం వ్యాఖ్యానించారు. నిజానికి ఆ యురేనియం తమకు అవసరం లేదని, ఇరాన్ వద్ద ఉండవద్దన్నదే తమ లక్ష్యమని చెప్పారు.

# గోవధకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెట్టాలి

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్**

**హైదరాబాద్, మే 21**



గోవధకు పాల్పడేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. దేశంలో గోవధ నిషేధ చట్టాలు అమలులో ఉన్నప్పటికీ, కొందరు కావాలనే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆయన మండిపడ్డారు. గోమాతను కాపాడుకోవడానికి, చట్టాన్ని రక్షించడానికి శాంతియుతంగా ప్రయత్నిస్తున్న గోరక్షకులను, బీజేపీ కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, కార్యకర్తలపై విధించిన బైండోవర్ చర్యలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గోవధ నిరోధక చట్టాన్ని రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో కఠినంగా అమలు చేయాలని అన్నారు. గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాంచందర్‌రావు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాగా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ వచ్చే నెలలో రాష్ట్ర పర్యటనకు రానున్నారు. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత బలోపేతంతో పాటు పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే వ్యూహంతో ఆయన పర్యటన కొనసాగనుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

# కేంద్ర మంత్రుల్లో వేటు ఎవరిపై?

- సేవాతీర్థ్‌లో సమావేశమైన కేంద్ర మంత్రివర్గం.. హాజరైన సహాయ, స్వతంత్ర, క్యాబినెట్ మంత్రులు
- శాఖల వారీగా పనితీరు నివేదికలను వివరించిన క్యాబినెట్ కార్యదర్శి
- కొందరు మంత్రులకు మోదీ క్లాసు
- ప్రభుత్వ పనితీరు మారాలని హితవు



**న్యూఢిల్లీ, మే 21**
కేంద్ర మంత్రివర్గంలో భారీగా మార్పులు, చేర్పులు జరగనున్నాయన్న అంచనాల నేపథ్యంలో గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం.. ఆ అంచనాలను బలపరిచే సంకేతాలనే ఇచ్చింది. తమ శాఖల పనితీరును వివరించే నివేదికలను వెంట తీసుకెళ్లిన మంత్రులు.. అప్పటికే ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ఆయా శాఖల వారీగా తయారు చేసిన నివేదికలను చూసి ఖంగుతిన్నట్లు సమాచారం. తొలుత సమావేశాన్ని ఉద్దేశించి మోదీ మాట్లాడిన తర్వాత.. క్యాబినెట్ కార్యదర్శి మంత్రిత్వ శాఖల వారీగా మంత్రులు, వారి కార్యదర్శుల పనితీరును వివరించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయా మంత్రులు, కార్యదర్శులు తమ బా?ధ్యతల నిర్వహణలో తీసుకున్న చర్యలు, లక్ష్యాలను సా?ధించడంలో వైఫల్యాలు, సరిదిద్దుకోవాల్సిన అంశాల గురించి మోదీ సమగ్రంగా సమీక్షించారు. వివిధ ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రధాని.. మంత్రులకు, కార్యదర్శులకు క్లాసు తీసుకున్నట్లు సమాచారం. 'దీంతో తమలో ఎవర్ని తప్పిస్తారు? కొనసాగిస్తే ఇప్పుడున్న శాఖలోనేనా? లేకపోతే వేరే ఏదైనా శాఖకు మారుస్తారా?' అన్న ఆందోళన మంత్రుల్లో కనపడిందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి.

ఐదు దేశాల పర్యటన ముగించుకొని బుధవారం రాత్రి తిరిగి వచ్చిన నరేంద్రమోదీ.. గురువారం సాయంత్రమే సహాయ మంత్రులతో సహా క్యాబినెట్ మంత్రులందర్నీ సేవాతీర్థ్‌లోని తన కార్యాలయంలో సమావేశానికి రావల్సిందిగా ఆదేశించారు. ఆయా శాఖలకు చెందిన సెక్రటరీలను కూడా ఈ సమావేశానికి పిలిచారు. 30 మంది క్యాబినెట్ మంత్రులు, ఐదుగురు స్వతంత్ర స్థాయి సహాయమంత్రులు, 36 మంది సహాయమంత్రులతోపాటు వారి కార్యదర్శులు హాజరయ్యారు. మోదీ మూడో దఫా పదవీ కాలానికి జూన్ 9తో రెండేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పరిపాలనా ప్రాధాన్యతలను నిర్ణయించడం, మంత్రిత్వ శాఖల పనితీరుపై సమీక్షను ఎజెండాగా నిర్ణయించారు.

**సుదీర్ఘకాలం సంక్షోభం కొనసాగే అవకాశం**
ప్రధాని మోదీ ప్రసంగంతో సమావేశం ప్రారంభమైంది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభంతో ఎదురవుతున్న ఇంధన సమస్య గురించి ప్రధాని వివరించారు. ఈ సంక్షోభం దీర్ఘకాలం కొనసాగే అవకాశాలున్నాయన్నారు. దేశంలో చమురు, ఇంధన నిల్వలు మరో 5 నెలల వరకు సరిపోతాయని, అయినప్పటికీ రాబోయే పరిణామాలకు ఇప్పటినుంచే సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రజలను తాను అప్రమత్తం చేశానని, అయితే మొత్తం ప్రభుత్వ పనితీరు మారాల్సిన అవసరం ఉన్నదని.. ప్రతి ఒక్కరూ సైనిక క్రమశిక్షణతో పనిచేయాలని, వీలైనంతగా ప్రజాధనాన్ని పొదుపు చేయాలని మోదీ హితవు పలికినట్లు సమాచారం. ప్రపంచ పరిణామాల నేపథ్యంలో దేశం ఎదుర్కొనే క్లిష్ట పరిస్థితులకు కలిసికట్టుగా సమాయత్తం కావాలని, అత్యంత సమర్థవంతంగా పని చేసి మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని మోదీ పిలుపునిచ్చారు. నిరుద్యోగ సమస్యను ఎదుర్కొనేందుకు జాతీయ రోజ్‌గార్ మేళా గురించి కూడా చర్చించినట్లు తెలిసింది. సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమైన సమావేశం రాత్రి 9.45 గంటల వరకు కొనసాగింది. మధ్యలో 8.15 గంటల వద్ద కొద్దిసేపు అల్పాహార విరామం తీసుకున్నారు. కాగా, ఈ సమీక్ష ప్రాతిపదికగా త్వరలో భారీ ఎత్తున మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని, సహాయమంత్రులతో సహా దాదాపు 25-30 మంది మంత్రులకు ఉద్వాసన తప్పదని, కొత్తవారికి అవకాశం లభిస్తుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ నెలాఖరులోపు బీజేపీ ఆఫీసు బేరర్ల నియామకం పూర్తవుతుందని, మంత్రివర్గం నుంచి తప్పించే పలువురికి పార్టీలో బాధ్యతలు అప్పగిస్తారని సమాచారం. ఆ తర్వాత వెంటనే క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# నిప్పుల కుంపటిలో దేశం



**న్యూఢిల్లీ, మే 21:**
ఉత్తరం, దక్షిణం అని తేడా లేకుండా సూరీడు చెలరేగిపోతున్నాడు. యావత్‌దేశం ఎండల బారిన పడి మలమల మాడుతోంది. దేశ రాజధాని ఢిల్లీ గురువారం నిప్పుల కుంపటిలా మారింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 31.9 డిగ్రీల సెల్సియస్ వద్ద నమోదయ్యాయి. గరిష్ఠం ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలను చేరే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఢిల్లీలో ఈ స్థాయి ఉష్ణోగ్రతలు 14 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. దీంతో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇక యూపీ ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఆ రాష్ట్రంలోని బాందాలో బుధవారం 48 డిగ్రీలు నమోదైంది. ఇది దేశంలోనే అత్యధికం. ప్రయాగ్‌రాజ్ (46.4), ఝాన్సీ (45.9), వారణాసి (43) తదితర ప్రాంతాల్లోనూ ఎండలు తీవ్రంగానే ఉన్నాయి. ఎండల కారణంగానే పంట దెబ్బతినే ప్రమాదం ఉన్నందున యూపీలో పలు ప్రాంతాల్లో రైతులు వరినాట్లను వాయిదా వేస్తున్నారు. అలీగఢ్ వంటి పట్టణాల్లోనైతే మధ్యాహ్నం వేళల్లో లాక్‌డౌన్ విధించినట్లుగా.. రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వచ్చే 3 రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంటూ ఐఎండీ యూపీకి రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాజస్థాన్‌లోని జైపూర్, అల్వార్ నగరాల్లో రోడ్లను చల్లబరచటానికి అధికారులు ట్యాంకర్లతో నీళు చల్లిస్తున్నారు. పాదచారుల కోసం తాత్కాలిక గుడారాలను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సీజన్‌లోనే గరిష్ఠ ఉష్ణోగ్రత 47.6 డిగ్రీల సెల్సియస్ పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్లలో నమోదైంది. రాష్ట్రంలో 11 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలను దాటాయి.

# ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి


## నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు

**లక్షెట్టిపేట మే21(మన సమాజం)**
లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక ఐబీ గెస్ట్ హౌస్‌లో స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట మండల, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, యువత సంక్షేమం కోసం రాజీవ్ గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు షాహిద్ అలీ, మండల అధ్యక్షులు నలిమేలా రాజు, జిల్లా ఆర్టీయె మెంబెర్ అంకతి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు చెల్ల నాగభూషణం, చింత అశోక్ కుమార్, ఆరిఫ్,దొంత నర్సయ్య,సయ్యద్ హాజీ, కాంగ్రెస్ నాయకులు యూత్ నాయకులు కౌన్సలర్లు



తదితరులు పాల్గొన్నారు..

# ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం



**కథలాపూర్ మే 21**
భారతరత్న స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ గారి 35వ వర్ధంతి కార్యక్రమాన్ని కథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఈరోజు రాజీవ్ గాంధీ గారి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నిర్వహించారు ఇట్టి కార్యక్రమంలోకథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి అజీమ్ పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య గారు మాట్లాడుతూ 40 ఏళ్ల వయస్సులోని దేశ రాజకీయాల్లో చారిత్రాత్మకంగా లోక్ సభ స్థానాల్లో 414 స్థానాలు గెలుచుకొని ఆ భారీ ప్రజా ఆదరణను రాజకీయ కోణంలో కాకుండా దేశ ప్రగతి నిర్మాణానికి వినియోగించిన గొప్ప మహానుభావుడు రాజీవ్ గాంధీ గారు అలాగే ఆయన ఇన్ఫోసిస్, విప్రో, టిసిఎస్ వంటి సంస్థలకు ప్రోత్సాహం అందించడంతో భారత ప్రపంచ స్థాయిలో ఎదిగింది, ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్, బలోపేతం చేయడంతో సాంకేతిక ఎదుగుదలకు పునాదులు వేశారు, యువతకు నాణ్యమైన విద్యను అందించాలని రాజీవ్ గాంధీ గారు ప్రత్యేకంగా కృషి చేశారు. ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ స్థాపనతో ఉన్నత విద్యను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉద్దేశంతో జవహర్ లాల్ నవోదయ విద్యాలయాలను ప్రారంభించారు ఇప్పుడు దేశవ్యాప్తంగా అనేక పేద మధ్య తరగతి విద్యార్థులు కూడిన నాణ్యమైన విద్యను పొందుతున్నారంటే దానికి కారణం ముందు చూపు గా రాజీవ్ గాంధీ గారి కృషి యే ముఖ్య కారణమని చెప్పొచ్చు యువత రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలని ముఖ్య ఉద్దేశంతో ఇరవై ఒక్క సంవత్సరంలుగా వున్నా ఓటు ను నుండి 18 సంవత్సరాల నుండే ఓటు హక్కును వినియోగించుకునేలా నిర్ణయం తీసుకుంటూ రాజకీయాల్లో యువతకు పెద్దపీట వేశారు, మహిళలు ఎస్సీలు ఎస్టీలు బీసీలు రాజకీయంలో రాణించాలని ఉద్దేశంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బాటలు వేసింది, మీరు మన వాడుతున్న ముందు చుపుతో పునాది బాటలు వేశారని ఈ సందర్భంగా ఆయన చేశారు, ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షుడు న్యావానంది శేఖర్ తక్కలపల్లి సర్పంచ్ రాజాగంగారం కథలాపూర్ ఉప సర్పంచ్ చేటపెల్లి ప్రసాద్ మ్యాధారవేని రాజు ఎంఎ ముబిన్ అంగ మహేష్ పిడుగు తిరుపతి రెడ్డి రిక్కల తిరుపతి రెడ్డి బాపురపు దేవేందర్ ఎంఎ మొయినోద్దీన్ అలాగే పలువురు కాంగ్రెస్ నాయకులు అంగ మహేష్ ఎండి నసీర్, ఎండి మొయిద్దీన్, అలాగే పలువురు మండల మరియు గ్రామస్థాయిలలో ఆయా శాఖలనుఫలహోదాలు కలిగిన సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం



**జగిత్యాల, మే 21**
జగిత్యాల జిల్లాలో రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న తీవ్ర అవ్యవస్థ, మౌలిక వసతుల కొరత, 'తరుగు–తేమ' పేరుతో రైతులపై జరుగుతున్న దోపిడీని అరికట్టి యుద్ధప్రాతిపదికన కొనుగోళ్లు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా శాఖ డిమాండ్ చేసింది ఈ మేరకు బిజెపి జగిత్యాల జిల్లా అధ్యక్షులు డా. రాచకొండ యాదగిరి బాబు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు, గన్నీ బ్యాగుల కొరత తీవ్రంగా ఉందని, రైతులు ధాన్యం తీసుకొచ్చి నెలరోజులు గడుస్తున్నా కాంటాలు వేయడం లేదని విమర్శించారు. హమాలీలు, లారీలు సకాలంలో అందుబాటులో లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 'తరుగు', 'తేమ' పేరుతో రైతులను బహిరంగంగా దోచుకుంటున్నారని, కొన్ని జిల్లాల్లో క్వింటాకు 3 నుంచి 5 కిలోల వరకు తరుగు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదాద్రి జిల్లా ఆత్మకూరులో ధాన్యం రాశులు పేరుకుపోయి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు సాధారణంగా మూడు నెలల పంటను అమ్ముకోవడానికి మరో రెండు నుంచి మూడు నెలలు పడుతుండటంతో రైతులు ఆర్థికంగా కుంగిపోతున్నారని పేర్కొన్నారు. పిల్లల ఫీజులు, కుటుంబ ఖర్చుల కోసం రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేటకు చెందిన రైతు వెంకటేశ్వరుడు కొనుగోలు కేంద్రం వద్ద రోజుల తరబడి టోకెన్ కోసం ఎదురుచూసి, చివరకు గుండెపోటుతో మృతి చెందడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని బిజెపి ఆరోపించింది. కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే కాంటాలు, గన్నీ బ్యాగులు, హమాలీలు, లారీలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి. 'తరుగు–తేమ' పేరుతో రైతులను దోచుకునే దళారులు, అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అకాల వర్షాల వల్ల పంట తడవకుండా టార్పాలిన్లు, రైతులకు కనీస వసతులు కల్పించాలి. ధాన్యం లిఫ్టింగ్ చేసిన వెంటనే వారం రోజుల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి. "రైతు రోడ్డెక్కిన తర్వాత స్పందించడం కాదు.. రైతు రోడ్డెక్కాల్సిన పరిస్థితి రాకుండా చూడటమే నిజమైన పాలన" అని బిజెపి స్పష్టం చేసింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో రైతుల పక్షాన బిజెపి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, జిల్లా కార్యాలయ కార్యదర్శి జుంబర్తి దివాకర్, జిల్లా కార్యదర్శి పీసు రాజేందర్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పిండేరు భానుప్రియ, జిల్లా కోశాధికారి సుంకెట దశరథరెడ్డి, మీడియా కన్వీనర్ భూమి రమణ, సోషల్ మీడియా కన్వీనర్ సుంచు సురేష్, ఎస్ఐఆర్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ పుప్పాల, దురిశెట్టి మమత, జున్ను రాజేందర్, గంగుల కొమురెల్లి, నారపాక అశోక్, ఇట్యాల రాము, చింతకింది రఘు, పాల్గొన్నారు.

## పంట పొలాల వరి కొయ్యలను, పంట వ్యర్థాలను కాల్చవద్దు. ఎస్సై కథలాపూర్

**కథలాపూర్ మే 21**
కథలాపూర్ మండల కేంద్రంలో ప్రెస్ మీట్ నిర్వహించిన ఎస్సై రవికిరణ్ గారు వరి కొయ్యలను కాల్చివేసే రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వేసవికాలంలో పొలాల వరి కొయ్యలకు, వ్యర్థాలకు నిప్పు పెట్టడం వలన ఇతర రైతులకు చెందిన పైపులు, సర్వీస్ వైర్లు, మోటార్స్ కాలిపోవడం మరియు ఇతర తోటలకు మంటలు వ్యాపించి వేల రూపాయల నష్టం కలిగిస్తుంది. కావున రైతులు పంట పొలాలకు నిప్పు అంటించకుండ వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి అట్టి ఎండు గడ్డిని ఎలా తీసివేయాలో, ఏం చేయాలో తెలుసుకొని శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని తెలియజేయడమైనది. ఇకముందు ఎవరైనా వరి పొలాలకు నిప్పు అంటిస్తే, అట్టి అంటించిన వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోబడునని కథలాపూర్ ఎస్సై రవి కిరణ్ గారు తెలియజేసినారు.



## యువత చెడు మార్గంలో నడిస్తే కఠిన చర్యలు : ఎస్సై శ్రీధర్..



**రామకృష్ణాపూర్, మే 21, (మన సమాజం):**
యువత చెడు మార్గంలో నడుస్తూ గంజాయి సేవించే వారితో పాటు సరఫరా చేసే వారిని కఠినంగా శిక్షిస్తామని పట్టణ ఎస్సై శ్రీధర్ హెచ్చరించారు . ఈ సందర్భంగా స్థానిక రాజీవ్ చౌక్, సూపర్ బజార్ ఏరియాలలో గంజాయి సరఫరా జరుగుతుందన్న సమాచారంతో గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు. పట్టణంలో గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న వారి సమాచారం ఇచ్చినట్లయితే పట్టుకొని కఠిన చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గొప్యంగా ఉంచుతామని ఎస్సై శ్రీధర్ తెలిపారు. యువతను చెడు మార్గంలోకి తీసుకెళ్లే మత్తు పదార్థాలను విక్రయించే షాపులపై నిరంతరం రైడింగ్ చేసి దొరికిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

## ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు



**రామకృష్ణాపూర్, మే 21, (మన సమాజం)ం**
స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి వేడుకలు క్యాతనపల్లి మున్సిపాలిటీలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, నాయకులతో కలిసి రాజీవ్ చౌక్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య పోరాటం నుండి నేటి వరకు దేశంలో ఆధునిక నిర్మాణానికి గాంధీ కుటుంబం కొత్త పీట వేస్తుందని హితవు పలికారు. కంప్యూటర్, తెలికాం రంగం అభివృద్ధి, సమాచార సాంకేతిక రంగ విస్తరణ వంటి వాటికి రాజీవ్ గాంధీ పునాది వేశారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత..



**రామకృష్ణాపూర్, మే 21, (మన సమాజం):**
ఇటీవల అనారోగ్యంతో బిజోన్ ఇందిరానగర్ కు చెందిన నిరుపేద మహిళ మంద సమ్మక్క మృతి చెందడంతో రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై శ్రీధర్ ఆ కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని గురువారం అందజేశారు. వారి కుటుంబానికి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందించడానికి తమ పోలీస్ శాఖ సిద్ధంగా ఉంటుందని ఎస్సై తెలిపారు. పోలీస్ విభాగం తమ సేవ భావాన్ని పెంపొందించినందుకు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా పెద్దమ్మ తల్లి పునః ప్రతిష్ఠాపన, బోనాల పండుగ

**మల్లాపూర్ మే 21**



జగిత్యాల జిల్లా మల్లాపూర్ లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమం, బోనాల మహోత్సవం గురువారం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, బోనాల ఊరేగింపులు భక్తిశ్రద్ధలతో సాగాయి. మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని గ్రామ ప్రధాన వీధిల గుండా ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ముదిరాజ్ సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దేశ ప్రజాస్వామ్య చరిత్రే కాంగ్రెస్ చరిత్ర!



కాంగ్రెస్ పార్టీ ప్రయాణం కేవలం రాజకీయ చరిత్ర కాదు. అది త్యాగం నుంచి స్వప్నం వరకు, ఉద్యమం నుంచి పరిపాలన వరకు సాగిన భారత ప్రజాస్వామ్య గాథ. నిన్నటి పోరాటం, నేటి ఆలోచన, రేపటి ఆశ... ఈ మూడింటి మధ్య వంతెనగా కాంగ్రెస్ పార్టీ నిలిచింది. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిరాేవం 1885లో ఏఓ హ్యూమ్ నేత ృత్వంలో జరిగింది. ఆ రోజుల్లో ఇది ఒక సంస్కరణవాద వేదికగా ప్రారంభమైనప్పటికీ, కాలక్రమంలో భారత స్వాతంత్ర్య ఉద్యమానికి వెన్నుదన్నుగా మారింది. స్వాతంత్ర్యం కోసం సాగిన సుదీర్ఘ పోరాటంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అనేక త్యాగాలు చేశారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడినందుకు వేలాదిమంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సంవత్సరాల తరబడి జైళ్లలో ఉన్నారు. గాంధీ, నెహ్రూ, వల్లభాయిపటేల్, రాజేంద్రప్రసాద్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి మహానేతలందరూ దీర్ఘకాల కారాగార జీవితాన్ని అనుభవించారు. ఎందరో కాంగ్రెస్ కార్యకర్తలు బ్రిటిష్ అణచివేతలో ప్రాణాలు కోల్పోయారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో ఆధునిక భారత నిర్మాణానికి పునాదులు పడ్డాయి. లౌకికత్వం, శాస్త్రీయ ద ృక్పథం, ప్రణాళికాబద్ధ ఆర్థిక అభివ ృద్ధి నెహ్రూ పాలనకు నిదర్శనాలుగా నిలిచాయి. ఆయన హయాంలో నిర్మితమైన భాక్రానంగల్, దామోదర్ వ్యాలీ, నాగార్జునసాగర్, హీరాకుడ్, కోసి డ్యామ్ వంటి భారీ సాగు నీటి ప్రాజెక్టులు దేశ ముఖచిత్రాన్ని మార్చివేశాయి. ఈ ప్రాజెక్టులు వ్యవసాయాన్ని స్థిరపరిచి ఆహార భద్రతకు దారి తీశాయి. ఇందిరాగాంధీ పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రాత్మక, విప్లవాత్మక నిర?యాలు తీసుకున్నది. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని రైతులు, పట్టణాల్లో నిరుద్యోగులు సమస్యలతో తల్లడిల్లారు. ఆహారం, విద్య, వైద్య వ్యవస్థలు అభివ ృద్ధి చెందలేదు. ఆర్థిక వ ృద్ధి ఉన్నా, దాని లాభాలు పేదలకు చేరలేదు. బ్యాంకులు, పరిశ్రమలు, భూములు, సంపద కొద్దిమంది చేతుల్లోనే ఉండేవి. ఈ అసమానతను తొలగించాలన్న ఆలోచనతోనే 'గరీబీ హటావో' నినాదాన్ని ఇందిరాగాంధీ దేశవ్యాప్తంగా తీసుకెళ్లారు. పేదలకు రుణాలు దొరకని పరిస్థితిని మార్చాలని సంకల్పించారు. బ్యాంకుల జాతీయీకరణ చేసి పేదలకు రుణాలు, సబ్సిడీలు వంటి చర్యలకు సిద్ధమయ్యారు. ఇందిరా హయంలోనే రాజస్థాన్ ఎడారిని పచ్చగా మార్చిన ఉకాయ్ డ్యామ్, జయక్వాడి నిర్మితం అయ్యాయి. రాజీవ్‌గాంధీ భారత రాజకీయాల్లో సాంకేతిక ద ృక్పథాన్ని ప్రవేశపెట్టారు. కంప్యూటరీకరణ, టెలికాం విస్తరణ వంటి నిర?యాలు నేటి డిజిటల్ భారతానికి పునాదులయ్యాయి. విదేశీ టెక్నాలజీ అంటే వ్యతిరేక భావన ఉన్న సమయంలో రాజీవ్‌గాంధీ కంప్యూటర్ల ప్రవేశానికి ధైర్యంగా మద్దతు ఇచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, రైల్వే, ఎయిర్‌లైన్స్‌లో కంప్యూటరీకరణకు బాటలు వేశారు. టెలిఫోన్ కమ్యూనికేషన్‌ను విస్తరించారు. ఎస్టీడీ, ఐఎస్డీ సేవలతో గ్రామీణ ప్రాంతాలకు టెలికాం సేవలు వేగంగా పెరిగాయి. సాఫ్ట్‌వేర్ రంగానికి ప్రోత్సాహం ఇచ్చారు. సాఫ్ట్‌వేర్ ఎగుమతులను ప్రోత్సహించి యువతకు ఐటీ విద్యను దగ్గర చేశారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగ హోదా కల్పించే 73వ, 74వ సవరణలు స్థానిక స్వయంపాలనకు కొత్త శక్తిని ఇచ్చాయి. రాజీవ్‌గాంధీ కాలంలో ఎన్నో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలూ మొదలయ్యాయి. మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా యూపీఏ-1, యూపీఏ-2 పాలనల్లో విప్లవాత్మక నిర?యాలు తీసుకున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (**MGNREGA**-2005) గ్రామీణ పేదలకు పనిచేసే హక్కును, ప్రతి కుటుంబానికి సంవత్సరానికి వంద రోజుల ఉపాధి హామీని కల్పించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేసింది. యూపీఏ పాలనతోనే సమాచార హక్కు చట్టం (RTI-2005) పౌరులకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును కల్పించింది. విద్యాహక్కు చట్టం (**RTE**-2009) 6 నుంచి 14 ఏళ్ల పిల్లలకు ఉచిత, తప్పనిసరి విద్యను మౌలిక హక్కుగా మార్చింది. ఆహార భద్రత చట్టం (**NFSA**--2013) పేదలకు తక్కువ ధరలకు ఆహార ధాన్యాలు లభించేలా చేసి, కోట్లాది కుటుంబాలకు ఆహార భరోసాను కల్పించింది. అటవీ హక్కుల చట్టం (2006) అడవుల్లో నివసించే గిరిజనులకు భూమిపై, వనరులపై హక్కులు కల్పించింది. భూమి సేకరణ చట్టం (2013)- భూమి సేకరణలో రైతులకు న్యాయమైన పరిహారాన్ని తప్పనిసరి చేసింది. యూపీఏ ప్రభుత్వం మహిళల స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహాన్ని ఇచ్చింది. సామాజిక సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యం కల్పించింది. ప్రపంచ ఆర్థిక మాంద్యం (2008) సమయంలో భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నడపగలిగింది. సంక్షేమంవ ృద్ధిసమతుల్య అభివ ృద్ధి నమూనా ముందుకు సాగింది. న్యూక్లియర్ ఒప్పందం (భారత్-అమెరికా పౌర అణు ఒప్పందం) అంతర్జాతీయంగా భారతదేశానికి మంచి గుర్తింపు తీసుకొచ్చింది. సంక్షేమ పథకాల లీకేజీల తగ్గింపు లక్ష్యంగా పౌరుల గుర్తింపు వ్యవస్థ ఆధార్ కార్డును తీసుకొచ్చింది. ఇందుకు భిన్నంగా గత పదకొండేళ్లుగా కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నది. ప్రభుత్వరంగ సంస్థలైన ఎయిర్‌పోర్టులు, పోర్టులు, బొగ్గు గనులు, జాతీయ రహదారులను ప్రైవేటు పరం చేస్తున్నది. ఉపాధి హామీ చట్టంలో మహాత్మాగాంధీ పేరు తొలగించి 'జీ-రామ్ జీ' అని పేరును, ఆ చట్టంలో నిబంధనలు మార్చి, ఆ చట్టాన్ని దాదాపు నిర్వీర్యం చేసింది. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నది. మరోపక్క రూపాయి మారకం విలువ రోజురోజుకు పడిపోతున్నది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి. నోట్ల రద్దు, జీఎస్టీతో ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. దేశంలో మతం పేరుతో నిత్య దాడులు పెట్రేగిపోతున్నాయి. గత దశాబ్ద కాలంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు అయినా నిర్మించలేదు. కాంగ్రెస్ హయాంలో ఎన్నో ఐఐటీ, ఐఐఎం వంటి అత్యున్నత విద్యా సంస్థలు మేధో వనరులను స ృష్టించి దేశాన్ని విజ్ఞాన ఆధారిత దేశంగా తీర్చిదిద్దాయి. కానీ బీజేపీ హయాంలో ఎన్ని కేంద్రీయ విద్యా సంస్థలు, ఎన్ని విశ్వవిద్యాలయాలు ప్రారంభమయ్యాయో లెక్క చూస్తే నిరాశ కలుగుతుంది. ఇలాంటి పనులు గాలికి వదిలి, రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను విచ్ఛిన్నం చేసి, ప్రభుత్వాలను కూలగొట్టే పని మీద ఎక్కువ ద ృష్టి పెట్టారు. ఓట్ చోరీతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరకు వచ్చాయి. మళ్ళీ మా నాయకుడు రాహుల్‌గాంధీ నాయ కత్వంలో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం. అందుకు తెలంగాణ నుంచి బీజం పడింది. రాష్ట్రంలోని ప్రజాపాలన దేశానికే ఆదర్శంగా నడుస్తున్నది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పుంజుకొని మళ్ళీ కేంద్రంలో అధికారాన్ని చేపట్టి ప్రజల ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరుస్తుంది.

## జీలకర్ర నీళ్లను రోజూ పరగడుపున తాగితే
## ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..?



మన వంటింట్లో ఉండే మసాలా దినుసుల్లో జీలకర్ర కూడా ఒకటి. భారతీయ వంటకాల్లో జీలకర్ర ముఖ్యపాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు. దాదాపు మనం చేసే అన్ని వంటకాల్లో జీలకర్రను వాడుతూ ఉంటాం. వంటలకు చక్కటి రుచి తీసుకు రావడంలో జీలకర్ర పాత్ర ఎంతో ఉంది. జీలకర్రలో ఔషధ గుణాలతో పాటు మన శరీరానికి అవసరమయ్యే పొటాషియం, క్యాల్షియం, సెలీనియం, రాగి, మాంగనీస్ వంటి పోషకాలు కూడా ఎన్నో ఉన్నాయి. జీలకర్రను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. అనేక రకాల అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం కలుగుతుంది. జీలకర్రను ఆహారంలో భాగంగా తీసుకోవడమే కాకుండా జీలకర్ర నీటిని తాగడం వల్ల కూడా మన ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా పరగడుపున ఈ నీటిని తాగడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చని వారు అంటున్నారు.

**రక్తహీనతకు చెక్..**

జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో జీవక్రియ పెరుగుతుంది. తద్వారా శరీరంలో పేరుకుపోయిన కొవ్వు కరగడంతోపాటు శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వారు జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల వేగంగా బరువు తగ్గుతారు. జీలకర్ర నీటిని తాగడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తరుచూ ఇన్ఫెక్షన్ ల బారిన పడే వారు జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. రక్తహీనతను తగ్గించడంలో కూడా జీలకర్ర నీరు మనకు సహాయపడుతుంది. జీలకర్రలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తహీనతను తగ్గించడంలో సహాయపడుతుంది. ఐరన్ తక్కువగా ఉన్నవారు, హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్నవారు రోజూ జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల ఎంతో మేలు కలుగుతుంది.

**కొలెస్ట్రాల్ తగ్గేందుకు..**


జీలకర్ర జీర ఎంజైమ్ లను ప్రేరేపిస్తుంది. జీలకర్ర నీటిని తాగడంవల్ల జీరక్రియ మెరుగుపడుతుంది. అజీర్తి, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. చక్కటి పొట్ట ఆరోగ్యానికి జీలకర్ర నీరు ఎంతో దోహదపడతాయి. జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. ట్రైగ్లిజరాయిడ్ స్థాయిలు కూడా తగ్గుతాయి. మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడే వారికి జీలకర్ర నీరు ఎంతో మేలు చేస్తుంది. రక్తపోటుతో బాధపడే వారికి కూడా జీలకర్ర నీరు మేలు చేస్తాయి. జీలకర్ర నీటిలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది.

**లివర్, కిడ్నీల ఆరోగ్యానికి..**

జీలకర్ర నీరు డిటాక్స్ డ్రింక్ గా కూడా పనిచేస్తాయి. ఈ నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో వ్యర్థాలు తొలగిపోతాయి. కాలేయం, మూత్రపిండాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. అంతేకాకుండా రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. ఈ విధంగా జీలకర్ర నీరు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ నీటిని ఉదయం పరగడుపున తీసుకోవడం వల్ల మనం మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఇక ఈ నీటిని మనం రెండు విధాలుగా తయారు చేసి తీసుకోవచ్చు. ఒక గ్లాస్ నీటిలో ఒక టీ స్పూన్ జీలకర్ర వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే వడకట్టి తీసుకోవచ్చు. అలాగే ఒక గ్లాస్ నీటిలో ఒక టీస్పూన్ జీలకర్ర వేసి బాగా మరిగించి వడకట్టి తాగవచ్చు.

## మా ఈత వనాన్ని మాకు దక్కనివ్వండి

**మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లకు గీత కార్మికుల వినతి**



**జగిత్యాల మే 21**

జగిత్యాల రూరల్ మండల పరిధిలోని జాబితాపూర్ గ్రామంలో సర్వే నెంబర్ 479లో తమకు కేటాయించిన స్థలాన్ని కాపాడాలని కోరుతూ గీత పారిశ్రామిక సహకార సంఘం నాయకులు గళమెత్తారు. గురువారం ఈ మేరకు మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డిని మరియు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి తమ బాధను వెళ్లబోసుకున్నారు.అనంతరం జగిత్యాల రూరల్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.?మైనింగ్ శాఖ నుండి రక్షణ కల్పించాలి ఈ సందర్భంగా గీత పారిశ్రామిక సహకార సంఘం నాయకులు బొమ్మకంటి లక్ష్మీనారాయణ గౌడ్, అనుపురపు తిరుపతి గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం గీత కార్మికుల కోసం కేటాయించిన 5 ఎకరాల స్థలంపై మైనింగ్ శాఖ పెత్తనం ఏమిటని ప్రశ్నించారు.తక్షణమే ఈ స్థలాన్ని సర్వే చేయించి, హద్దులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అక్రమణదారులు మరియు మైనింగ్ శాఖ నుండి తమకు రక్షణ కల్పించి, ఈత వనాన్ని కాపాడాలని కోరారు. ”మా జీవనాధారమైన ఈత వనాన్ని కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధం.గా ఉంటాం అన్నారు తక్షణమే అధికారులు స్పందించి గీత కార్మికుల కలను నెరవేర్చి మాకు న్యాయం చేయాలిని కోరారు.ఈ కార్యక్రమంలో కందుల శేఖర్ గౌడ్, ఏగోలపు నరేష్ గౌడ్, తిరుపతి గౌడ్, జాగిరి శేఖర్ గౌడ్, పల్లె సంతోష్ గౌడ్, మల్లేశం గౌడ్, శ్రవణ్ గౌడ్, బొమ్మ కంటి రంజిత్ గౌడ్, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## పుట్టెడు దుఃఖంతో ఉన్న కుటుంబాన్ని పరామర్శించిన చల్మెడ



మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన వడ్లగడ్డ శేఖర్ భార్గవి దంపతుల కుమారుడు శర్వానంద్ శివ గంగమ్మ తల్లి కోనేరులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందగా పుట్టెడు దుఃఖంతో ఉన్న కుటుంబాన్ని గురువారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహా రావు గారు పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట సర్పంచులు మకిలి దాసు, గంగారెడ్డి, అజిత్ రావు సీనియర్ నాయకులు నెల్లుట్ల ప్రభాకర్, ఆదిరెడ్డి, లక్ష్మిరాజం, అర్జున్, రాజ బోస్, గంగాధర్, వెంకటేష్, హరీష్, రాకేష్, శివ, కొండాపూర్ గ్రామ నాయకులు చెరుకూరి శ్రీనివాస్, మునుగురి నాగరాజు, ముక్కెర ముత్తు, తుమేనాపెల్లి సతీష్, హనుమండ్ల వెంకటరమణ, బేక్కం శంకర్, పెండం కాంత్తయ్య తదితరులు ఉన్నారు.

## గాంధీ పథమా? లెనిన్ మార్గమా?

అహింసా ప్రవక్త మహాత్ముడు, అక్టోబర్ విప్లవ నిర్మాత లెనిన్ చింతనా ధోరణులలోని తారతమ్యాలను నిశితంగా విశ్లేషించిన, సాద ృశ్యాలను ఎత్తిచూపిన వంద సంవత్సరాల నాటి ఒక ఆసక్తికరమైన పుస్తకాన్ని నేను ఇటీవల చదివాను. 'లెనిన్ అండ్ గాంధీ' అనేది ఆ పుస్తకం శీర్షిక. గ్రంథకర్త ఆస్ట్రియన్ రచయిత, చరిత్రకారుడు రెనే ఫ్యులోప్ మిల్లర్ (1891-1963). తొలుత ఫ్రెంచ్ భాషలో ప్రచురితమైన ఈ పుస్తకం 1927లో ఆంగ్లంలోకి అనువదితమయింది. గాంధీ, లెనిన్‌లు సమకాలికులు. ఆరునెలల తేడాతో వారు ఈ ప్రపంచంలోకి ప్రవేశించారు. ఇరువురూ మధ్యతరగతి కుటుంబాలలో జన్మించారు. పేదరికం, అన్యాయాల నుంచి మానవకోటిని విముక్తం చేయాలనే ప్రగాఢ ఆకాంక్ష వారి జీవితాలను విలక్షణంగా నడిపించింది. లెనిన్ తన రచనలలో కనికరం లేని కఠిన వాదనలు చేసేవారు. గాంధీ ప్రజా జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ చాలా నాగరీకంగా వ్యవహరించేవారు. మరో ముఖ్యమైన తేడా- లెనిన్ హింసను ఆరాధించి హింసాత్మక పద్ధతులను అనుసరించారు. అహింసకు అంకితమయిన ఉదాత్తుడు గాంధీజీ. మనసా వాచా కర్మణా అహింసావాది.నాకు తెలిసినంతవరకు గాంధీ, లెనిన్‌ల భావజాలాలను తులనాత్మకంగా పరిశీలించిన తొలి రచయిత బొంబాయి కమ్యూనిస్టు శ్రీపాద్ అమ ృత్‌డాంగే (1899-1991). 1921లో ఆయన 'గాంధీ వర్సెస్ లెనిన్' అనే ఒక చిన్న పుస్తకాన్ని రాశారు. ఈ కమ్యూనిస్టు సహజంగానే గాంధీ కంటే లెనిన్ వైపే మొగ్గారు. అయితే తన స్వదేశీయుడి భావాలు, ఆలోచనల పట్ల ఆసక్తి, సానుభూతిని నిలుపుకున్నారు. 'గాంధీ, లెనిన్ సిద్ధాంతాలు ఆచరణాత్మక జీవితంలో సాకారమవ్వడం అసాధ్యం' అని డాంగే వ్యాఖ్యానించారు. డాంగే పుస్తకం వెలువడిన నాలుగు సంవత్సరాలకు హ్యారీ వార్డ్ (1873-1960) అనే అమెరికన్ మెథడిస్ట్ క్రైస్తవ పండితుడు 1925 ఏప్రిల్‌లో 'ది వరల్డ్ టుమారో' అనే జర్నల్‌లో 'లెనిన్ అండ్ గాంధీ' అనే వ్యాసాన్ని రాశారు. గాంధీ, లెనిన్ ఇరువురూ తమ మధ్యతరగతి నేపథ్యాన్ని అధిగమించి, తమ నిరాడంబర జీవనశైలుల ద్వారా సామాన్య మానవులతో తాదాత్మ్యమయ్యారని వార్డ్ పేర్కొన్నారు.




# మాస్ పల్స్ తెలిసింది

అగ్ర హీరోలతో కలసి భారీ చిత్రాల్లో నటిస్తున్నా.. మంగళూరు సోయగం పూజాహెగ్డేకు అదృష్టం కలిసి రావడం లేదు. బాక్సాఫీస్ ఫలితాల పరంగా ఈ భామ కాస్త నిరుత్సాహంగా ఉంది. అయితే అవకాశాలపరంగా ఎలాంటి లోటులేదని, ఈ ఏడాది బ్లాక్‌బస్టర్ హిట్‌తో ముందుకొస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నది. తాజా ఇంటర్వ్యూలో కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకుందీ భామ. కెరీర్ ఆరంభం నుంచి కమర్షియల్ సినిమాల్లో నటించడం వల్ల మాస్ పల్స్‌ని బాగా అర్థం చేసుకున్నానని తెలిపింది. గ్లామర్ రోల్స్ కాస్త బోర్? అనిపించినా.. తన స్క్రీన్?ప్రజెన్స్? చూసి ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్నానని ఈ సొగసరి చెప్పుకొచ్చింది. 'ఇప్పుడు గ్లామర్? రోల్స్?పై ఏమాత్రం మక్కువ లేదు. ప్రభావవంతమైన పాత్రలు చేస్తేనే కెరీర్?లో లాంగ్విటీ ఉంటుందనే విషయం అర్థమైంది. ఇక ఇండస్ట్రీలో పోటీ గురించి నేను అస్సలు ఆలోచించను. ప్రతిభ ఉంది కాబట్టే ఇప్పటికీ భారీ చిత్రాల్లో అవకాశాలొస్తున్నాయి. భవిష్యత్తులో నటిగా సవాళ్లను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నా' అని పూజాహెగ్డే పేర్కొన్నది. ఈ భామ దళపతి విజయ్?తో కలిసి నటించిన 'జన నాయగన్?' చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది.

# సామాన్యుడి 'ఆత్మకథ'



జెమిని సురేష్, రూప జంటగా నటిస్తున్న చిత్రం 'ఆత్మకథ'. 'యాన్ అన్‌టోల్డ్ స్టోరీ' ఉపశీర్షిక. శ్రీనివాస్ గుండ్రెడ్డి దర్శకుడు. గురువారం ఈ సినిమా టైటిల్, ట్రైలర్‌ను బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆవిష్కరించారు. ఒక ఇంట్లో జరిగే కథ ఇదని, సామాన్యుడి జీవితానికి దర్పణంలా ఆకట్టుకుంటుందని దర్శకుడు శ్రీనివాస్ గుండ్రెడ్డి తెలిపారు. అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేసి వచ్చిన వెంటనే తనకు ఈ సినిమా అవకాశం రావడం శివుడి ఆశీర్వాదంలా భావిస్తున్నానని, గొప్ప కథతో ఈ సినిమా తెరకెక్కుతున్నదని హీరో జెమిని సురేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. రూప, పృథ్వీ, సమ్మెట గాంధీ, షకలక శంకర్, తాగుబోతు రమేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: గోపీ, సంగీతం: శ్రేయాంశ్, నిర్మాణ సంస్థ: వారాహి ఎంటర్‌టైన్‌మెంట్స్, నిర్మాత: అర్థం వారాహి సోమేష్, కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు, దర్శకత్వం: శ్రీనివాస్ గుండ్రెడ్డి.

# అవన్నీ అబద్ధాలే

తాజాగా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంతో కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకున్నది తెలుగమ్మాయి డింపుల్ హయాతి. త్వరలో మరికొన్ని సినిమాలతో ఈ అందాలభామ సందడి చేయనున్నది. ఇదిలావుంటే.. డింపుల్ హయాతి వివాహిత అని, తన భర్త పేరు డేవిడ్ అని ఆ మధ్య వార్తలు వచ్చాయి. ఈ విషయంపై ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు డింపుల్ స్పందిస్తూ, తన పెళ్లి గురించి క్లారిటీ ఇచ్చింది. 'నాకు పెళ్లి అయ్యిందంటూ గతంలో చాలామంది రాశారు. అవన్నీ అబద్ధాలే. నేను అవివాహితను. ఇలాంటి వార్తలు నా కెరీర్‌ని ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. అందుకే వివరణ ఇస్తున్నా.' అని చెప్పుకొచ్చింది డింపుల్ హయాతి. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ సమాధానం వైరల్ అవుతున్నది.



# పెద్ది' కోసం ప్రాణం పెట్టిన రామ్ చరణ్.. కంటికి కుట్లు, చేతికి గాయం..

### కూతురిని ఎత్తుకోలేకపోయాడట!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్స్ ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో రామ్ చరణ్, బుచ్చిబాబు కలిసి పాల్గొన్న ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో షూటింగ్‌కు సంబంధించిన ఎన్నో ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ డెడికేషన్ గురించి బుచ్చిబాబు ప్రత్యేకంగా మాట్లాడారు. సినిమా కోసం చరణ్ మూడు వేర్వేరు బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్స్ చేశారని తెలిపారు. క్రికెటర్ లుక్, ట్రైబల్ లుక్, రెజ్లర్ లుక్ కోసం ఆయన తీవ్రంగా శ్రమించారని చెప్పారు. దీనిపై స్పందించిన చరణ్.. "నువ్వు రాసిన కథతో నేను ప్రేమలో పడ్డాను. అంత మంచి కథ కోసం ఎంత కష్టపడినా తక్కువే. ఎండల్లో, ఇసుకలో షూటింగ్ చేయడం చాలా కష్టం అయినా, ప్రాసెస్‌ను ఆస్వాదించడంతో ఆ శ్రమ పెద్దగా అనిపించలేదు" అని తెలిపారు. అయితే రెజ్లింగ్ సన్నివేశాల చిత్రీకరణ మాత్రం తనకు చాలా కఠినంగా మారిందని చరణ్ వెల్లడించారు. "నన్ను అన్ని రకాల బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్స్ చేయించడానికి బుచ్చిబాబు చాలా కష్టపెట్టాడు" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఇంటర్వ్యూలో మరో ఆసక్తికర విషయాన్ని కూడా రామ్ చరణ్ గుర్తుచేసుకున్నారు. కరోనా సమయంలో తాను కొంత మానసికంగా డౌన్ ఫీల్ అయ్యానని, ఆర్ఆర్ఆర్ షూటింగ్ తిరిగి మొదలయ్యే సమయంలో కూడా మునుపటి ఉత్సాహం లేదని చెప్పారు. ఆ సమయంలో దర్శకుడు రాజమౌళి ఇచ్చిన సలహా తనలో మళ్లీ ఉత్సాహాన్ని నింపిందని వెల్లడించారు. "పెద్ద లక్ష్యాల కంటే చిన్న పనులతో మొదలుపెట్టు. చిన్న విజయాలే పెద్ద మోటివేషన్ ఇస్తాయి" అని రాజమౌళి చెప్పిన మాటలు ఇప్పటికీ గుర్తున్నాయని తెలిపారు. సినిమాలోని కుస్తీ ఎపిసోడ్స్ గురించి మాట్లాడుతూ, బుచ్చిబాబు యాక్టింగ్ తెలిసిన జూనియర్ ఆర్టిస్టుల కంటే నిజమైన రెజ్లర్లనే తీసుకొచ్చారని చరణ్ చెప్పారు. "వాళ్లు కెమెరా కోసం నటించలేదు. నిజంగానే మ్యాచ్ ఆడినట్టుగా నాపై దాడి చేసేవారు. సీన్ సహజంగా రావడం కోసం నేను కూడా వాళ్లతో అంతే తీవ్రంగా పోరాడాల్సి వచ్చేది" అని తెలిపారు. ఈ రియల్ ఫైట్స్ వల్ల తాను తీవ్ర గాయాలు కూడా ఎదుర్కొన్నట్లు చరణ్ వెల్లడించారు. "చివరి 25-30 రోజుల కుస్తీ షెడ్యూల్ చాలా కఠినంగా సాగింది. షూటింగ్ సమయంలో కంటికి బలమైన దెబ్బ తగిలి దాదాపు నాలుగు కుట్లు పడ్డాయి. అలాగే చేతికి కార్టిలేజ్ టియర్ కూడా అయ్యింది. చేతులకు వచ్చిన నొప్పి ఎంత తీవ్రంగా ఉందంటే షూటింగ్ పూర్తయిన తర్వాత నా కూతురిని కూడా ఎత్తుకోలేకపోయాను. ఇప్పటికీ ఆ నొప్పి పూర్తిగా తగ్గలేదు. ఎక్స్‌రే కూడా చేయించుకోవాలి" అని భావోద్వేగంగా చెప్పారు.